కరువు జిల్లాకు మేలు చేయాలని..
ఇక్కడి యువత వలసలు ఆపాలని..
పరితపిస్తివి..
ఎన్నో పోరాటాలు చేసి..
కార్ల దిగ్గజం కియను
సాధిస్తివి..
వేల మందికి ఉద్యోగాలిచ్చి..
ఎందరికో ఉపాధి..
చూపితివి..
పారిశ్రామిక ప్రగతి రథాన్ని
ఇంకా.. ఇంకా.. ముందుకు..
నడిపిస్తివి..
జిల్లా అంతటా ఏర్పాటు చేయాలని..
పారిశ్రామిక హబ్‌గా మార్చాలని..
కలలుగంటివి..
ఆ తరువాత అధికారం మారి..
వైసీపీ పగ్గాలు చేపట్టింది..
ప్రగతిని అటకెక్కించింది..
సిద్ధంగా ఉన్న పరిశ్రమలను
తరిమేసింది..
కొత్త వాటి ఏర్పాటుకు అడ్డుపడింది..
జిల్లావాసికి చీకట్లు మిగిల్చింది..
ఐదేళ్లూ అధోగతి పాల్జేసింది..
మళ్లీ నువ్వు గెలిచావ్..
మూలనపడిన పారిశ్రామిక ప్రగతి..
అటకెక్కిన అభివృద్ధి..
నీరుగారిపోయిన అనంత ఆశలు..
ప్రాణం పోసుకుంటున్నాయి..
నీ రాక కోసం
ఎదురుచూస్తున్నాయి..
చంద్రన్నా..

- వైసీపీ హయాంలో అటకెక్కిన ప్రగతి
- ఐదేళ్లూ.. అధ్వానమే..
- టీడీపీ విజయంతో జిల్లా ప్రజల్లో ఆశలు
- పారిశ్రామిక ప్రగతి పట్టా లెక్కుతుందంటూ హర్షం
- సొంతూర్ల వైపు యువత చూపు


ఉపాధి పొందుతున్న యువత



కియ ట్రయల్ ప్రొడక్షన్ ప్రారంభోత్సవంలో చంద్రబాబు, కియ ప్రతినిధులు (ఫైల్)

మళ్లీ మంచి రోజులు

టీడీపీ హయంలో 2016 జూలై 22న దక్షిణ కొరియా నుంచి కియ బృందం ఉమ్మడి అనంత జిల్లాలోకి అడుగు పెట్టింది. ఎర్రమంచి వద్ద కార్ల పరిశ్రమ ఏర్పాటుకు 2017 ఏప్రిల్ 20న అమరావతిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో కియ మోటార్స్ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2018 ఫిబ్రవరిలో ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ ప్రారంభించి, 2019 జనవరి 29న కార్ల ప్రయోగాత్మక ఉత్పత్తిని అప్పట్లో చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఏటా మూడు లక్షల కార్ల ఉత్పత్తి సామర్థ్యంతో గతేడాది జూలైలోనే పలు మోడళ్లతో పది లక్షల కార్ల ఉత్పత్తి మైలురాయిని దాటేసి, చరిత్ర సృష్టించింది కియ. నేడు లక్షల కార్ల ఉత్పత్తితోపాటు వేలాది మందికి ఉపాధి చూపుతోంది. ఆ తరువాత వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిశ్రమల జాడ కనిపించలేదు.

ఐదేళ్లూ హామీల డప్పు



వైసీపీ ఐదేళ్ల కాలంలో జగన్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 పేరుతో విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడుల ఆకర్షణీయ సదస్సులో 13లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని గొప్పలు చెప్పారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. ఆ మేరకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయని ప్రకటించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రకటనలే తప్ప.. జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటైంది లేదు. వచ్చిన పరిశ్రమలను సైతం పక్కరాష్ట్రాలకు పరుగులు పెట్టించారు.


కియ కార్ల పరిశ్రమ



ఇక.. పారిశ్రామిక పరుగులే..



కియ ఏర్పాటుతో మారిన జిల్లా రూపురేఖలు

పుట్టపర్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా అనగానే గుర్తొచ్చేది వెనుకబాటుతనం. ఇలాంటి జిల్లాలో అభివృద్ధికి బీజం వేశారు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు. హిందూపురం మండలంలోని తూముకుంట వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటుచేసి, జిల్లా ప్రగతికి బాటలు వేశారు. అన్న చూపిన బాటలో అడుగులు వేశారు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు. జిల్లా కరువుకు పారిశ్రామికాభివృద్ధే విరుగుడు అని భావించారు. అందులో భాగంగా సరిగ్గా ఎనిమిదేళ్ల క్రితం జిల్లాకు కియ కార్ల పరిశ్రమను తీసుకొచ్చి, జెట్ వేగంతో నిర్మాణం పూర్తి చేశారు. అనుబంధ పరిశ్రమలు భారీ సంఖ్యలో తరలివచ్చాయి. వేల మందికి ఉపాధి లభించింది. జిల్లావాసి తలసరి ఆదాయాన్నే పెంచేసింది. జిల్లా రూపురేఖలు మారిపోయాయి. ప్రపంచ పారిశ్రామిక వేత్తల చూపు జిల్లా వైపు మళ్లింది. పెనుకొండ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. భవిష్యత్తులో వైజాగ్-చెన్నై, బెంగళూరు-అనంతపురం పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు బీజం పడి, ఉపాధి కల్పన జిల్లాగా మారింది. తరువాత వైసీపీ అధికారం చేపట్టాక పారిశ్రామికాభివృద్ధి అటకెక్కింది. అప్పట్లో ఆ పార్టీ ప్రజాప్రతినిధుల బెదిరింపులతో జిల్లాకు వచ్చిన పరిశ్రమలు సైతం ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయి. దీంతో ఉపాధి కోసం యువత ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మళ్లీ పక్క రాష్ట్రాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. టీడీపీ కూటమి మళ్లీ అధికారంలోకి రావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టడం ఖాయమనీ, మళ్లీ ఉద్యోగ, ఉపాధి అవకాశాల వరద పారుతుందని ఎంతో నమ్మకంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే వలస వెళ్లిన జిల్లా యువత తిరిగి సొంతూళ్లకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

జిల్లావైపు పారిశ్రామిక వేత్తల చూపు

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా అనువైన భూములను టీడీపీ హయాంలోనే గుర్తించారు. గోరంట్ల, సోమందేపల్లి, పాలసముద్రం, గుడిపల్లి వద్ద 2015లో ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణి నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ నార్కోటిక్స్, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (బెల్) నిర్మాణం చేపట్టారు. గుడిపల్లి పారిశ్రామిక వాడలో 209.18 ఎకరాల్లో 14 పరిశ్రమలు ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో కియ కార్ల పరిశ్రమ రాకతో ఆటోమొబైల్ హబ్‌గా విస్తరించింది. ఇప్పటికే సేకరించిన భూముల్లో ఏపీఐఐసీ మౌళిక సదుపాయాలు కల్పించి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు భూములు అప్పగించేందుకు సిద్ధం చేసింది. పెనుకొండ, పాలసముద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర, రాళ్లఅనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, నడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద పరిశ్రమల ఏర్పాటుకు 8వేల ఎకరాలకుపైగా గురించారు. 2వేల ఎకరాలు సిద్ధంగా ఉంది. పెనుకొండ, అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు ఏడేళ్ల కిందటే పలువురు ఔత్సాహికులు ముందుకొచ్చి, ఒప్పందాలు చేసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ఔత్సాహికులు వెనక్కి జంకారు. ప్రస్తుతం టీడీపీ కూటమి అధికారం చేపట్టనుండడం, చంద్రబాబు సీఎం పీఠం అధిరోహించనుండడంతో జిల్లాకు పరిశ్రమలు క్యూకట్టే రోజులు వచ్చేశాయి. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. మళ్లీ టీడీపీ రాకతో యువత, రైతు కుటుంబాలతోపాటు లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ఆశలు రేకెత్తించింది. భారీ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా మారుతుందని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.



కప్పలబండ పారిశ్రామిక వాడ

సెజ్ పేరుతో దోపిడీ

వైఎస్ఆర్ పాలనలో 44వ జాతీయ రహదారి పక్కన జిల్లా సరిహద్దు చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 2006లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు ఉపక్రమించారు. పరిశ్రమల నిర్మాణానికి రైతుల నుంచి ఏపీఐఐసీ 8844 ఎకరాల భూములను సేకరించి, లేపాక్షి హబ్‌కు విడతల వారీగా కట్టబెట్టింది. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా.. వాటిని వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి, లేపాక్షి నాలెడ్జ్‌హబ్ యాజమాన్యం వందల కోట్లుపైగా రుణాలు పొందిన సంగతి తెలిసిందే. ఆ నిధులను పక్కదారి పట్టించడం, నిబంధనలు అతిక్రమించారన్న ఆరోపణలు రావడంతో లేపాక్షి భూములపై 2013లో సీబీఐ విచారణ వేశారు. అక్రమాలను సీబీఐ నిర్ధారించి, 3800 ఎకరాలకుపైగా ఈడీకి అటాచ్ చేసింది. నేటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. లేపాక్షి హబ్ వ్యవహారంలోని వైసీపీ ప్రభుత్వంలోని సీఎం బినామీలు ఉన్న నేపథ్యంలో 15 ఏళ్లుగా బందీఖానాలో భూములపై మళ్లీ టీడీపీ అధికారంలోకి రావండతో చిక్కుముడి వీడి పారిశ్రామికాభివృద్ధికి అడుగులు పడే సూచనలు కన్పిస్తున్నాయి.

వీరవిధేయుల్లో వణుకు



- తట్టాబుట్టా సర్దుకుంటున్న పలువురు అధికారులు
- టీడీపీ నాయకులతో మరికొందరు రాయబారాలు

ఇబ్బంది పెట్టిన వారికి సహకరిస్తే సహించమంటున్న కార్యకర్తలు

హిందూపురం, జూన్ 6: వైసీపీ హయాంలో ఎన్నడూలేని విధంగా కొంతమంది అధికారులు విచక్షణ కోల్పోయి ప్రభుత్వానికి వీరవిధేయులుగా పనిచేశారు. మరికొందరు ఇక రాష్ట్రంలో వైసీపీనే శాశ్వతంగా అధికారంలో ఉంటుందన్న భ్రమలోపడి ప్రతిపక్ష పార్టీలను టార్గెట్ చేస్తూ వేధించారు. మరికొందరు అధికారులైతే ఒకానొక దశలో వైసీపీ నాయకుల కంటే అత్యుత్సాహంతో పనిచేశారు. ఈనెల 4న వెలువడిన ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో వైసీపీ తుడిచిపెట్టుకుపోయిందని చెప్పవచ్చు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఆ తరువాత వైసీపీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు భారీ విజయాలు సాధించారు. ఈ తరుణంలో అలాంటి వీరవిధేయులు మూడురోజులుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ప్రస్తుతం వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఉండడం కంటే వేరే చోటుకు వెళ్లిపోవడమే మేలని భావియం లేదని చెప్పుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. గత తెలుగుదేశం హయాంలో కూడా ఫలానా ప్రాంతాల్లో పనిచేశామనీ, కావాలంటే అక్కడ టీడీపీ నాయకులను ఆరా తీయండనీ, చెప్పినట్లే పనిచేస్తామని తమకు అవకాశం ఇవ్వాలని టీడీపీ నాయకులతో ప్రాధేయ పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది అధికారులు... ఆయా ఎమ్మెల్యేలకు దగ్గరగా ఉండే వర్గంతో టచ్‌లోకి వచ్చి ఒకసారి ఎమ్మెల్యేతో కల్పిస్తే తాము అడుగుతామని నాయకులను ప్రాధేయ పడుతున్నారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో మూడు నాలుగు ముఖ్యశాఖల అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

స్తున్నారు. మరికొంతమంది అధికారులు ఇప్పటికే తట్టాబుట్టా సద్దుకునే పనిలో ఉన్నారు. ఇంకొందరైతే తెలుగుదేశం నాయకుల టచ్‌లోకి వచ్చి రాయబారాలు నడుపుతున్నారు. ఐదేళ్లలో కొంతమంది అధికారుల పనితీరు, సామాన్యులకు పెట్టిన ఇబ్బందులు, ప్రతిపక్ష నాయకులను వేధించిన తీరు గుర్తుపెట్టుకున్న కార్యకర్తలు మాత్రం తమకు ఇబ్బందిపెట్టిన వారికి నాయకులు సహకరిస్తే సహించేది లేదని కరాఖండిగా చెబుతున్నారు.

సర్దేసుకుంటున్నారు..

నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం మినహా ఆరు నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలే మొన్నటి వరకు ఉన్నారు. హిందూపురంలో నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యే అయినా ఇక్కడ కూడా అధికార పార్టీ నాయకులదే హవా సాగింది. ఏ కార్యాలయంలోనూ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పనులు జరగలేదు. దీంతో కొంతమంది అధికారులు కౌంటింగ్‌కు ముందు రోజు వరకు వైసీపీ నాయకులకే పెద్దపీట వేస్తూ వచ్చారు. రెండు నెలలు ముందుగానే నోటిఫికేషన్ వచ్చినా, అప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని సామాన్యులు సైతం అంచనా వేసినా వైసీపీ నాయకులతో అంటకాగుతూ వచ్చిన అధికారులు మాత్రం మేలుకోకపోవడం శోచనీయం. ఈ పరిస్థితుల్లో వారికి వ్యతిరేకంగా ఫలితాలు రావడంతో ఇక తమను ఎలాగూ ఇక్కడ పెట్టుకోరని తెలిసి తట్టాబుట్టా సద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ముఖ్యశాఖల అధికారులు ఎప్పుడు బదిలీ వస్తుందా, బయటకు వెళ్లిపోదామా అన్న ఆలోచనలో పడ్డారు.

టీడీపీ నాయకులతో రాయబారాలు

కొన్ని శాఖల అధికారులు మాత్రం తాము వైసీపీకి పనిచే

ఆందోళనలో మరికొందరు...

ఏస్థాయి ఉద్యోగులైనా ప్రభుత్వంతో అంటకాగడమనేది ఆక్షేపణీయం. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఉద్యోగులు అంతకంటే ఎక్కువగా రెచ్చిపోయారు. విచక్షణ మరిచి కొందరు అధికారులు పనిచేశారు. అలాంటివారు ప్రస్తుతం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూడు, నాలుగు శాఖల అధికారులే ఇలాంటి ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా కొంతమంది అధికారులు బరితెగించి పనిచేశారు. అలాంటి వారిలో అభద్రతాభావం నెలకొంది.

వారికి సహకరిస్తే సహించేది లేదు

వైసీపీ ఐదేళ్ల పాలనలో తమను ఇబ్బంది పెట్టిన అధికారులకు టీడీపీ నాయకులు సహకరిస్తే సహించేది లేదని కార్యకర్తలు, మద్దతుదారులు కరాఖండిగా చెబుతున్నారు. ఏం జరిగినా ఇబ్బందులు పడేది, అవసరమైతే ఊళ్లు వదిలి దూరంగా వెళ్లేది కార్యకర్తలే. ఈ ఐదేళ్లలో ఇబ్బంది పెట్టిన పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులకు సహకరించి, తీసుకొచ్చినా, ఇక్కడున్న వారిని కొనసాగించినా నాయకులనే వ్యతిరేకిస్తామని కార్యకర్తలు బహిరంగంగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకులతో ముడిపడిన పోలీసు, రెవెన్యూ, సెబ్, మునిసిపల్ శాఖలతోపాటు మరికొన్ని విభాగాలపైనే ఇలాంటి ఆరోపణలు బలంగా ఉంటాయి. ఏదిఏమైనా ఐదేళ్లుగా వైసీపీతో అంటకాగిన, వీరవిధేయులుగా ఉన్న అధికారుల్లో ఈనెల 4నుంచి వణుకు మొదలైందని చెప్పవచ్చు.

74 మంది డిపాజిట్లు గల్లంతు



నోటాకు 29,035 ఓట్లు

పుట్టపర్తి, జూన్ 6: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన 74 మంది డిపాజిట్ గల్లంతైంది. జిల్లాలో ఒక ఎంపీ, ఆరు అసెంబ్లీ స్థానాల బరిలో మొత్తం 90 నిలిచారు. అన్నిచోట్లా కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వైసీపీ తరపున పోటీ చేసిన ఏడుగురికి, మడకశిరలో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్లు దక్కాయి. పోలైన ఓట్లలో పదిశాతం వచ్చిన వారికి మాత్రమే డిపాజిట్ వెనక్కిస్తారు. జిల్లాలో కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగిన 74 మందికి అతితక్కువ ఓట్లు రావడంతో డిపాజిట్ కోల్పోయారు.

నోటా పోటీ..

జిల్లాలో నోటాకు 29035 ఓట్లు వచ్చాయి. పోటీలో ఉన్న వారెవరూ నచ్చకపోతే ఓటరు నోటాకి వేయొచ్చు. 2014 సార్వత్రిక ఎన్నికలనుంచి నోటా అమలులోకి వచ్చింది. ఎంపీ స్థానానికి 17971, ఆరు అసెంబ్లీ స్థానాలకు 11764 నోటాకేశారు. అత్యధికంగా మడకశిరలో 2684, అత్యల్పంగా పుట్టపర్తి అసెంబ్లీ స్థానానికి 1382 ఓట్లు నోటాకు వచ్చాయి. కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు రావడం గమనార్హం.



బత్తలపల్లిలో భారీ వర్షం

పుట్టపర్తి రూరల్, జూన్ 6: బత్తలపల్లిలో వాన దంచికొట్టింది. 63.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రి పలుచోట్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ధర్మవరంలో 43.6, లేపాక్షి 8.2, ఓబుళదేవరచెరువు 16.2, హిందూపురం 14.8, పరిగి 30.6, నంబులపూలకుంట 26.6, సోమందేపల్లి 26.4, తలుపుల 24.4, చిలమత్తూరు 20.4, గోరంట్ల 19.2, గాండ్లపెంట 18.8, అమడగూరు 18.2, తాడిమర్రి 16.4, కదిరి, కొత్తచెరువు 15.2, ముదిగుబ్బ 14.8, పెనుకొండ 13.2, చెన్నేకొత్తపల్లి 12.4, బుక్కపట్నం, అమరాపురం 10.4, పుట్టపర్తి, నల్లచెరువు 8.2, రామగిరి 6.8, నల్లమాడ 4.8, కనగానపల్లి 4.2, మడకశిరలో 2.6 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలియజేశారు.

వైసీపీ నాయకుడి దాష్టీకం

- తాగునీటి పథకంపై జులుం
- కాయిన్ బాక్సు తీసుకెళ్లిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు

పెనుకొండ రూరల్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేక రొద్దం మండలం బీదానిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి తాగునీటి పథకంపై జులుం ప్రదర్శించాడు. తాగునీటి పథకానికి అమర్చిన కాయిన్‌బాక్స్‌ను గురువారం పగులగొట్టి, ఎత్తుకెళ్లాడు. తెలుగుదేశం హయాంలో బీదానిపల్లిలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ నుంచి ప్రజలు రూ.5 కాయిన్ వేసి, మినరల్ వాటర్ తీసుకెళ్లేవారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో జీర్ణించుకోలేని గోపాల్‌రెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకం కాయిన్‌బాక్స్‌ను ధ్వంసం చేసి, ఎత్తుకెళ్లాడు. దీంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజ్, సర్పంచ్ మంజునాథ్.. రొద్దం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గోపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వలీ బాషా తెలిపారు.


తాగునీటి పథకం షెడ్డుకు కన్నం వేసి కాయిన్ బాక్సు తీసుకెళ్లిన దృశ్యం

అప్రజాస్వామిక విధానాలతోనే వైసీపీ ఓటమి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

పుట్టపర్తి రూరల్, జూన్ 6: వైసీపీ అప్రజాస్వామిక నిర్ణయాలు, కార్మిక, కర్షక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలతోనే ప్రజలు ఓడించారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలో ఉన్న సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలైన ఇసుక, మద్యం మాఫియా, కొండలు, గుట్టల భూముల ఆక్రమణలు, మంత్రులు, ఎమ్మెల్యేల మాటతీరు వంటి ఎన్నో ప్రజావ్యతిరేక విధానాల కారణంగా జగన్ ప్రభుత్వం చతికిలపడిందన్నారు. ఏ ప్రభుత్వమైనా రైతులు, కార్మికులు, ఉద్యోగులను విస్మరించరాదన్నారు. ఎన్నోసార్లు ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే వాటిని పాలక పెద్దలు చెత్తబుట్టలో వేశారని వాపోయారు. అంగన్‌వాడీ, మునిసిపల్ కార్మికులు, ఆశాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలని ఎన్నో సమయాల్లో పోరాడితే లాఠీలకు పనిజెప్పి తరిమారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఓడించారని ప్రస్తుతం కన్నీళ్లు పెట్టుకున్న జగన్ గతంలో లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులు, రైతులను కన్నీళ్లు పెట్టించారన్నారు. కరువు జిల్లాలో పండ్లతోటల కోసం ఉన్న డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని ఎత్తివేసిన ఘనత కూడా జగన్‌దేనన్నారు. మతతత్వంతో లబ్ధి పొందాలని చూసిన బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికైనా కొత్తప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. శ్రామిక మహిళా నాయకురాలు దిల్షాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేసు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఓబులు

అధినేతను కలిసిన అనంత విజేతలు

అనంతపురం అర్బన్/ఉరవకొండ/ధర్మవరం, జూన్ 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును అనంతపురం తెలుగు తమ్ముళ్లు గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో వారు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉరవకొండ, రాయదుర్గం, అనంతపురం అర్బన్, ధర్మవరం విజేతలు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్, సత్యకుమార్‌యాదవ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి.. చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు.


చంద్రబాబుతో పయ్యావుల కేశవ్


కాలవ శ్రీనివాసులు..


దగ్గుపాటి ప్రసాద్


సత్యకుమార్ యాదవ్


మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

హెచ్చెల్సీ వాటా 26.36 టీఎంసీలు

టీబీ డ్యాంలో 172 టీఎంసీల నీటి లభ్యత

అంచనా వేసిన తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు

మూడు రాష్ట్రాల ఎస్‌ఈలతో సమావేశం

రాయదుర్గం, జూన్ 6: తుంగభద్ర జలాశయంలో ఈ ఏడాది 172 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని బోర్డు అంచనా వేసింది. కర్ణాటక రాష్ట్రం.. హొస్పేట్‌లోని టీబీబోర్డు కార్యాలయంలో బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతపురం ఎస్‌ఈ రాజశేఖర్, కర్నూలు ఎల్లెల్సీ ఎస్‌ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, కర్ణాటక ఎల్‌బీఎంసీ ఎస్‌ఈ బసవరాజ్‌నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. నీటి లభ్యత అంచనాల ఆధారంగా ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల వాటాను నిర్ణయించారు. 2024-25లో ముందస్తు రుతుపవనాల కారణంగా జలాశయానికి 172 టీఎంసీల నీరు చేరుతుందని అంచనా వేశారు. ఏపీ వాటాగా 53.953 టీఎంసీలను కేటాయించారు. అందులో ఫ్లోరేటా ప్రకారం హెచ్చెల్సీకి 26.368 టీఎంసీలు, ఎల్లెల్సీకి 19.472 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు 8.113 టీఎంసీల నీరు అందుతాయని అంచనా వేశారు. తెలంగాణ వాటా కింద 5.282 టీఎంసీల నీటిని ఆర్‌డీఎస్ కాలువ ద్వారా అందించాలని నిర్ణయించారు. కర్ణాటకకు 112.765 టీఎంసీల నీటిని కేటాయించారు. ఫ్లోరేటా ప్రకారం హెచ్చెల్సీకి 13.440 టీఎంసీలు, రాయబసవ కెనాల్‌కు 5.376 టీఎంసీలు, ఆర్డీఎస్ కెనాల్‌కు 1.912 టీఎంసీలు, ఎల్‌బీఎంసీకి 71.423 టీఎంసీలు అందించాలని నిర్ణయించారు. తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు. ఆరునెలల పాటు ఎగువ ప్రాంతాల్లో ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురుస్తాయని, నీటి లభ్యత ఆశాజనకంగానే ఉంటుందని భావిస్తున్నారు. 200 టీఎంసీలకుపైగా నీటి లభ్యత ఉంటే బచావత్ అవార్డు ప్రకారం కాలువలకు కేటాయించిన నీటిని అందించే అవకాశం ఉంటుందని బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీకి బచావత్ ట్రిబ్యునల్ 32.5 టీఎంసీల నీరు కేటాయించారు. కానీ ఈ ఏడాది నీటి లభ్యతను బట్టి 26.368 టీఎంసీలు ఇవ్వాలని నిర్ణయించారు. జూలై 20వ తేదీన హెచ్చెల్సీకి ఏపీ వాటా నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సమావేశంలో తీర్మానం చేశారు. జలాశయంలోకి ముందుగానే నీరు చేరితే నిర్ణయించిన తేదీకంటే ముందే నీటిని విడుదల చేసే అంశాన్ని కూడా చర్చించారు.


హొస్పేటలోని తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు కార్యాలయంలో సమావేశమైన మూడు రాష్ట్రాల ఎస్‌ఈలు

అడ్డగోలు బదిలీలకు బ్రేక్

వైసీపీని మోసిన టీచర్లకు షాక్

ఎన్నికలకు ముందు దొడ్డిదారి బదిలీలు

ఫిర్యాదు చేసిన జేఏసీ, కూటమి పెద్దలు

స్పందించిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

అనంతపురం విద్య, జూన్ 6: వైసీపీ పాలనలో ఐదేళ్లు బడిని మర్చిపోయారు. తాము ఉపాధ్యాయులమన్న సంగతి మర్చిపోయారు. వైసీపీ ప్రభుత్వాన్ని భుజాన మోశారు. పైరవీలతో పబ్బం గడుపుకున్నారు. ఎన్నికలు సమీపించగానే అధికార పార్టీ నాయకుల అండతో, రూ.లక్షలు వెచ్చించి అడ్డగోలుగా బదిలీలు చేయించుకున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఉన్న పలు పాఠశాలలకు పోస్టింగ్ ఇప్పించుకున్నారు. ఎన్నికలు పూర్తవ్వగానే ఆగమేఘాల మీద బడిలో వాలిపోదామని అనుకున్నారు. కానీ అధికారం చేతులు మారింది. కోడ్ అమలులో ఉండటం, పోలింగ్, కౌంటింగ్‌కు మధ్య చాలా రోజుల వ్యవధి ఉండటంతో కొందరు సంఘాల నాయకులు, ఉపాధ్యాయుల ఎత్తులు పారలేదు. అడ్డగోలు బదిలీలను ఆపేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేయడంతో వారి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయింది.


ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు

అడ్డగోలుగా బదిలీలు

జిల్లాలో 49 వరకూ అడ్డగోలు ఆర్డర్లు తెచ్చుకున్నట్లు సమాచారం. వైసీపీ పెద్దలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులను పట్టుకుని చాలా మంది పైరవీలు చేశారు. అనంతపురం, రూరల్ మండలం, బుక్కరాయసముద్రం, ఇతర సమీప మండలాల్లోని పలు స్కూళ్లకు బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఎస్జీటీలు 11 మంది, స్కూల్ అసిస్టెంట్లు 30 మంది, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ముగ్గురు, పీఈటీలు ముగ్గురు, గ్రేడ్ -2 హెచ్‌ఎంలు ఇద్దరు ఇలా బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొందరు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు ముడుపులు కట్టారని తెలిసింది. తాము వైసీపీకి వీరవిధేయులమని, వైఎస్‌ఆర్‌టీఏ నాయకులమని చెప్పుకుని.. వైసీపీ పెద్దలను పట్టుకుని ఉత్తర్వులు తెచ్చుకున్నారు. దీనిపై అప్పట్లో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేక వచ్చింది.

జగన్‌పై భక్తి

అడ్డగోలుగా ఆర్డర్లు అందుకున్న నాయకులు కొందరు వైసీపీ కోసం ఎన్నికల్లో ప్రచారం చేశారు. డిన్నర్ రాజకీయాలు నడిపారు. పగలు ఉపాధ్యాయులుగా.. సాయంత్రం పార్టీ నాయకులుగా ద్విపాత్రాభినయం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టింది. అయినా ఆ పార్టీకి విధేయులుగా సంఘాల నాయకులు రాజకీయం నెరపడం పట్ల ఉపాధ్యాయులు విమర్శలు గుప్పించారు. వైసీపీ కోసం ఎన్నికల రాజకీయాలు చేసినవారిలో వైఎస్‌ఆర్‌టీఏ నాయకులతోపాటు కొందరు ఏపీటీఎఫ్ నాయకులు కూడా ఉన్నారు. ఇబ్బందులు పడుతున్న సగటు ఉపాధ్యాయులను వదిలేసి.. జగన్‌కు మళ్లీ ఓటు వేయాలని ప్రచారం చేయడం ఏమిటని అప్పట్లోనే మండిపడ్డారు.

ఉత్తర్వుల నిలిపివేత

బదిలీలపై బ్యాన్ ఉన్న సమయంలో వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని కొందరు అడ్డగోలుగా బదిలీల ఉత్తర్వులు తెచ్చుకున్నారు. మరో వారం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభమౌతాయి. అడ్డగోలు బదిలీలు తెచ్చుకున్నవారు వెంటనే స్కూళ్లలో చేరి సుఖంగా గడుపుదామని అనుకున్నారు. కానీ వారి అక్రమాలను పసిగట్టి, సిఫార్సు బదిలీలపై విద్యాశాఖకు పలువురు ఫిర్యాదులు చేశారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వ పెద్దలు, జేఏసీ నాయకులు ఫిర్యాదు చేయడంతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి స్పందించారు. బదిలీ ఉత్తర్వులను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులు డీఈఓలకు గురువారం చేరాయి.

93 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

అనంతపురం విద్య, జూన్ 6: జిల్లాలోని 1, 2 తరగతులు బోధించే 93 మంది టీచర్లకు రెండురోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. గురువారం న్యూటౌన్ బాయ్స్ హైస్కూల్‌లో శిక్షణను ప్రారంభించారు. శిక్షణను డీఈఓ వరలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లాసుల్లో కూర్చొని ట్రైనింగ్ క్లాసులు విన్నారు. తర్వాత డీఈఓ మాట్లాడుతూ పిల్లలకు తరగతులు బోధించే సమయంలో ఉపాధ్యాయులు ఓర్పు, నేర్పుతో ఉండాలని సూచించారు. పిల్లలకు తమ సొంత పిల్లలుగా భావించి బోధన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగానాయక్, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్లాసులు వింటున్న డీఈఓ


చంద్రబాబు చిత్రపటం ఏర్పాటు అనంతరం టీఎన్ఎస్ఎఫ్ నాయకుల నినాదాలు

ఎస్కేయూలో చంద్రబాబు చిత్రపటం ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయాన్ని సాధించడంతో నూతన సీఎంగా నారా చంద్రబాబు నాయుడు త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం ఎస్కేయూ వీసీ చాంబర్‌లో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు చంద్రబాబునాయుడి చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. ఇక నుంచి ఉద్యోగులను, సిబ్బందిని వేధించడం, అరాచకాలకు పాల్పడటం వంటి చర్యలకు తావులేకుండా పాలన సాగుతుందని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా వర్సిటీ పాలన ఉండబోతోందని సీఎంగా చంద్రబాబునాయుడు మళ్లీరావడం అన్ని వర్గాలకు శుభపరిణామమని పేర్కొన్నారు.

రానున్న ఐదు రోజుల్లో పిడుగులతో కూడిన వర్షం

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు

వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, జూన్ 6: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయని రేకులకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్ర వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో వర్షం కురుస్తుందన్నారు. పిడుగులు పడే అవకాశం ఉందని, గాలి కూడా ఎక్కువగా వీయనుందన్నారు. రాయలసీమ, ఉత్తర రాయలసీమ పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రం మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో ఉందన్నారు. పలు చోట్ల గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. అనంత, సత్యసాయి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల పడే అవకాశముందని పేర్కొన్నారు.

రేపు హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం, జూన్ 6: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో శనివారం సీనియర్ పురుషుల హాకీ జిల్లా జట్ల ఎంపికను చేపడతున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్, హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ బంధనాథం సూర్యప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి 30 వరకు ధర్మవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 01-01-1995 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆధార్ కార్డు, బర్త్‌సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని కోరారు.

9 వరకు స్పాట్

అనంతపురం విద్య, జూన్ 6: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల స్పాట్ ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. గురువారం స్పాట్ ప్రారంభమైంది. పలు జిల్లాల నుంచి 15 వేలకుపైగా జవాబు పత్రాలు జిల్లాకు రాగా వాటి మూల్యాంకనం కోసం 254 మంది సీఈ,ఏఈ, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు.

చీనీకాయలు టన్ను రూ.40 వేలు

అనంతపురంరూరల్, జూన్ 6: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40 వేలు, కనిష్ఠంగా రూ.18 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 684 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బీటెక్ మూక్స్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 6: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు(మూక్స్) పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు గురువారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మేలో తృతీయ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్, నాల్గవ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (ఆర్20) మూక్స్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 6: టూవీలర్ రిపేరీకి సంబంధించి శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజులపాటు శిక్షణ ఉంటుందని, బైక్ రిపేరీతోపాటు ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఉంటుందన్నారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పదోతరగతి, ఐటీఐ, ఇంటర్ చదివిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం ఉచితంగా అందజేస్తామని, శిక్షణ అనంతర ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9390505952, 7780752418లను సంప్రదించాలని కోరారు.

కొండచిలువ పట్టివేత

కొత్తచెరువు, జూన్ 6: మండల కేంద్రంలోని ఓ కోళ్ల ఫారంలోకి ప్రవేశించిన కొండచిలువను పట్టుకున్నారు. గాజుల సూర్యనారాయణ వ్యవసాయ బావి వద్ద షెడ్‌లో కోళ్ల పెంపకం చేపట్టారు. గురువారం కోళ్లషెడ్‌లోకి ఐదు అడుగుల పొడవు ఉన్న కొండ చిలువ ప్రవేశించి రెండు కోళ్లను మింగేసింది. విషయాన్ని గమనించిన సూర్యనారాయణ స్నేక్‌క్యాచర్ లక్ష్మయ్యకు సమాచారం అందించడంతో ఆయన ఆ కొండ చిలువను పట్టుకుని నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెట్టారు.


కొండచిలువను పట్టుకున్న లక్ష్మయ్య

ఎన్నికల్లో విజేతలకు ఈ-పోస్ట్ ద్వారా శుభాకాంక్షలు

తపాలాశాఖ వినూత్న కార్యక్రమం



అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపేందుకు తపాలశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ-పోస్ట్ విషెస్ పేరుతో గురువారం కొత్త సంప్రదాయానికి తెరతీసింది. తపాలశాఖ తీసుకున్న ఈ-పోస్ట్ శుభాకాంక్షల విలువ రూ.10లు పోస్ట్, జీఎస్టీ రూ.2తో కలిపి రూ.12. శుభాకాంక్షలు తెలిపే వారు తమ దగ్గరలోని పోస్టాఫీసులో నాయకుడి పేరు, నియోజకవర్గాన్ని తెలియపరిస్తే సంబంధిత పోస్టాఫీసు అధికారులు ఏ4 రూపంలో ఆ సందేశాన్ని ఈ-పోస్ట్ ద్వారా ఆ ప్రాంత పోస్టాఫీసుకు చేరవేస్తారు. వారు ఆ సందేశాన్ని సాఫ్ట్‌కాపీగా మార్చి ఆ నాయకుడి ఇంటికి చేరవేస్తారు. దీనిద్వారా పల్లెటూరు నుంచి ప్రధానమంత్రికి కూడా శుభాకాంక్షలు తెలుపవచ్చు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుంది. ఈ నేపథ్యంలో తమకిష్టమైన నాయకులకు శుభాకాంక్షలు ఈ పోస్ట్ ద్వారా తెలిపే అవకాశాన్ని తపాలాశాఖ కల్పించింది.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఈ-పోస్ట్ విషెస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఏ ప్రాంతంలో ఉన్న నాయకులకైనా శుభాకాంక్షలు తెలుపవచ్చు.

- గుంపస్వామి, తపాలాశాఖ సూపరింటెండెంట్

ఉప్పొంగిన పాతాళగంగ

గోరంట్ల, జూన్ 6: పాతాళగంగ ఉప్పొంగింది. మండలంలోని గౌనివారిపల్లి సమీపాన పొలంలో నీరు ఉబికి వస్తోంది. మండలంలో బుధవారం రాత్రి 19.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గౌనివారిపల్లికి చెందిన ఎర్రగుట్ల సోమిరెడ్డి పొలంలో నీరు నిలిచింది. గ్రామస్థులు అది వర్షపు నీరు అనుకున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలైనా నీరు అలాగే ఉండటంతో వారికి అనుమానం వచ్చింది. కొంతమంది యువకులు, రైతులు పరిశీలించగా, భూమి నుంచి నాలుగుచోట్ల నీరు ఉబికి వస్తున్నట్లు తేలింది. ఒకచోట అధికంగా, మిగిలిన చోట్ల తక్కువగా నీరు వస్తోంది. నీరు ఉబికి వస్తున్న చోట చేతులు అడ్డుపెట్టినా ఆగడం లేదన్నారు. గ్రామంలో గురువారం తెల్లవారుజామున పిడుగుపాటు శబ్దం వచ్చిందని, అది సోమిరెడ్డి పొలంలో పడి ఉండొచ్చని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంతోనే నీరు ఉబికి వస్తోందని భావిస్తున్నారు.


పొలంలో నీటిని పరిశీలిస్తున్న స్థానికులు

పాలిసెట్ కౌన్సెలింగ్ సందడి

సర్టిఫికెట్ల పరిశీలనకు ఆఖరి రోజు కావడంతో పోటెత్తిన విద్యార్థులు

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు: కన్వీనర్

అనంతపురం సెంట్రల్, జూన్ 6: పాలిసెట్ కౌన్సెలింగ్‌కు విద్యార్థులు భారీగా తరలివచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలనకు గురువారం చివరి రోజు కావడంతో ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ జరిగింది. 500 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రివరకు సాగింది. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ కళాశాలల్లో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినా జిల్లా కేంద్రంలోని కళాశాలకే విద్యార్థులు తరలివచ్చారు. షెడ్యూల్ మేరకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 3న ప్రారంభం కావాల్సి ఉండగా ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గురువారం నిర్వహించారు. ఇందుకు అవసరమైన కుల, ఆదాయ, స్టడీ తదితర సర్టిఫికెట్లను మంజూరు చేసే అధికారులు అందుబాటులేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యామని విద్యార్థులు వాపోయారు. వెరిఫికేషన్ ప్రక్రియ గడువును పొడిగించాలని స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు.

అవగాహనా లోపం

కౌన్సెలింగ్ కేంద్రాలను ఏయే కళాశాలల్లో ఏర్పాటుచేశారో అధికారులకే తెలియని స్థితి నెలకొంది. మదనపల్లి, పీలేరు ప్రాంతాలకు చెందిన అనేకమంది విద్యార్థులను అనంతపురం వెళ్లాలని అక్కడి పాలిటెక్నిక్ కళాశాలల అధికారులు సూచించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వారు ఇక్కడ జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. హిందూపురం, కళ్యాణదుర్గం కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటుచేసినా సమాచార లోపంతో ఆయా ప్రాంతాల మండలాలకు చెందిన విద్యార్థులు సైతం అనంతపురం వచ్చారు. మరోవైపు ఎస్టీ కేటగిరికి చెందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురంలో చేపట్టారు. ఎస్సీ కేటగిరికి చెందిన విద్యార్థులను కూడా ఇక్కడికే పంపించడం అధికారుల తీరుకు అద్దం పడుతోంది. విద్యార్థులు పెద్దఎత్తున తరలిరావడంతో వారిని కట్టడి చేయడానికి కౌన్సెలింగ్ నిర్వాహక కన్వీనర్ జయచంద్రారెడ్డి, సిస్టమ్ అడ్మిషన్ సరిత ఇతర అధికారులు నానా తంటాలు పడ్డారు.


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకున్న విద్యార్థులు శుక్రవారం నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని కౌన్సెలింగ్ కన్వీనర్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారానే విద్యార్థులు వారికి నచ్చిన కళాశాలలు, బ్రాంచ్(కోర్సు)లు ఎంపిక చేసుకోవచ్చునన్నారు. 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

వేతన బకాయిలు ఇవ్వండి

సీపీడబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులు

విడపనకల్లు, జూన్ 6: బకాయి వేతనాలు ఇవ్వాలని సీపీడబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ వేధిస్తున్నాడన్నారు. ఫిబ్రవరిలో నిరసన తెలుపగా నాలుగు నెలల వేతనాలు ఇచ్చారని, తరువాత ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. వేతనాల విషయం అటు కాంట్రాక్టర్‌గాని ఇటు అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడం లేదని చెబుతున్నారన్నారు. ఇలా చేస్తే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. పీఎఫ్ మంజూరు చేయాలని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. తమకు వేతనాలు అందే వరకు తాగునీటిని సరఫరా కానీయమని వివరించారు. కాంట్రాక్టు కార్మికులు నిరసన వ్యక్తం చేయడంతో తొమ్మిది గ్రామాలకు నీటి సరఫరా బంద్ అయ్యింది. ఈ కార్యక్రమంలో కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

బాల్యవివాహాలను అరికట్టాలి: ఆర్డీఓ



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ


పాల్గొన్న అధికారులు

పుట్టపర్తి రూరల్,జూన్ 6: రెవెన్యూ డివిజన్‌లో గ్రామగ్రామాన బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసి వాటిని పూర్తి స్థాయిలో అరికట్టాలని ఆర్డీఓ భాగ్యరేఖ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్యవివాహాల నిరోధిక చట్టంపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006పై జీఓనెంబర్ 13 ద్వారా డివిజన్ స్థాయి నుంచి గ్రామగ్రామాన బాల్యవివాహాల నిరోధిక అధికారులను నియమించడం జరిగిందన్నారు. ప్రతిగ్రామంలో కౌమారదశకు వచ్చిన బాలికలకు, వారి తల్లితండ్రులకు బాల్యవివాహనిరోధక అధికారులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేయాలన్నారు. ఇంట్లో ఇల్లాలు చదువుకుంటే ఆఇంటికంతా వెలుగనే విషయాన్ని తెలియచేయాలన్నారు. అమ్మాయిల చదువు ఎంత విలువైందో ప్రతి తల్లితండ్రికి వివరించాలన్నారు. డీఎస్పీ వాసుదేవన్ మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే మండలస్థాయి పోలీసు అధికారులకు కానీ, బాల్యవివాహాల నిరోధకశాఖ అధికారులకు గాని ప్రజలు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందుకున్న వెంటనే సంబంధితాధికారులు అక్కడకు చేరుకుని వాటిని ఆపుతారని చెప్పారు. అంతేకాకుండా బాల్యవివాహాల చట్టం ప్రకారం వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి మాట్లాడుతూ బాల్యవివాహాల గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా 181కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఐసీడీఎస్ సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఎంఈఓలు, ఐసీడీఎస్ సిబ్బంది, శిశుగృహసిబ్బంది, బాల్యవివాహాల నిరోధక అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రెటరీలు, మహిళాపోలీసులు పాల్గొన్నారు.

పల్లెలే పట్టం కట్టాయి

పోరాడి గెలిచిన కందికుంట


కందికుంట వెంకటప్రసాద్

కదిరి, జూన్ 6: నియోకవర్గంలో పట్టణంలో కంటే పల్లె ఓటర్లు టీడీపీ కూటమికి ఎక్కువ మెజార్టీ ఇచ్చారు. కందికుంట వెంకటప్రసాద్ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో టీడీపీ మెజార్టీ తగ్గింది.

- తలుపుల మండలంలో 13,426 ఓట్లు టీడీపీకి, 12,884 ఓట్లు వైసీపీకి పడగా.. 542 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చింది.
- కదిరి రూరల్‌లో 12,831 ఓట్లు టీడీపీకి, 11,148 ఓట్లు వైసీపీకి పడగా.. 1,683 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చింది.
- గాండ్లపెంట మండలంలో 9,626 ఓట్లు టీడీపీకి, 8,430 ఓట్లు వైసీపీకి పడగా.. 1.196 ఓట్ల మెజారిటీ టీడీపీకే వచ్చింది.
- నంబులపూలకుంట మండలంలో 11,115ఓట్లు టీడీపీకి, 8,792 వైసీపీకి పడగా.. 2,323 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చింది.
- నల్లచెరువు మండలంలో11,842 ఓట్లు టీడీపీకి, 9,762 ఓట్లు వైసీపీకి పడగా.. 2,080 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చింది.
- తనకల్లు మండలంలో 17,918 ఓట్లు టీడీపీకి, 15,693 ఓట్లు వైసీపీకి పడగా.. 2,225 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చింది.
- కదిరి పట్టణంలో 24,433 ఓట్లు టీడీపీకి, 29,520 ఓట్లు వైసీపీకి పడడంతో 5,087 ఓట్ల మెజారిటీ వైసీపీకి వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో 1,303 ఓట్ల మెజారిటీ టీడీపీకే వచ్చింది. దీంతో మొత్తం మీద 6,265 మెజారిటీతో టీడీపీ విజయం సాధించింది.
- కదిరి పట్టణంలో దాదాపు 57వేల ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో టీడీపీకి 24,433, వైసీపీకి 29,520 ఓట్లు వచ్చాయి. ఇతరులకు 2,328 ఓట్లు వచ్చాయి. దీంతో పట్టణంలో వైసీపీకి 5,087 మెజార్టీ వచ్చింది.
- కందికుంట 2009 ఎన్నికల్లో మొదటిసారిగా గెలిచారు. తర్వాత 2014, 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. చివరకు 2024 ఎన్నికల్లో రెండోసారి గెలిచారు. నియోజకవర్గంలో ఉన్న రెండు బలమైన సామాజిక వర్గాలతో నిత్యం పోరాటం చేస్తూనే ఉన్నారు. ఆ రెండు సామాజిక వర్గాలకు సంబంధించిన సంప్రదాయ ఓటర్లు వైసీపీ వైపు ఉన్నారు. వీరి ఓట్లు దాదాపు 90వేల వరకు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ఓ సామాజిక వర్గం ఈ ఎన్నికల్లో టీడీపీ వైపు మొగ్గు చూపింది. దీంతో కందికుంట విజయానికి ఎదురు లేకుండా పోయింది.

ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీకి ఎంపిక

ధర్మవరం, జూన్ 6: ఉమ్మడి అనంతపురం జిల్లా క్రికెట్ జట్టుకు ధర్మవరం క్రికెటర్లు ఎంపికైనట్టు కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ గురువారం తెలిపారు. ధర్మవరం ఆర్డీటీ క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న నాగజ్యోతి, తేజుదీపిక, అనూష ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వెంకటగిరిలో ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు జరిగే అండర్-19కు టోర్నమెంట్‌కు నాగజ్యోతి, తేజుదీపిక, అండర్-23కి అనూష ఎంపికయ్యారని కోచ్‌లు తెలిపారు. ఎంపికైన క్రికెటర్లను అభినందించారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వర్షపునీరు

- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనచోదకులు


బ్రిడ్జికింద వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

ధర్మవరం, జూన్ 6: పట్టణంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గాంధీనగర్ రైల్వేఅండర్ బ్రిడ్జికింద వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం కొత్తపేట నుంచి వాహనాలు బ్రిడ్జి కింద నుంచి నీటిలో రాకపోకలు సాగించాయి. కొన్ని వాహనాలు ఆ నీటిలో ముందుకెళ్లలేక అలాగే నిలిచిపోయాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోకి రావడానికి బ్రిడ్జికింద వర్షపు నీరు ఉండటంతో స్థానికులు రాజేంద్రనగర్ నుంచి పోతుకుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి వైపు వెళ్లి అక్కడి నుంచి పట్టణంలోకి వచ్చారు. దీంతో దాదాపు మూడు కిలోమీటర్లు చుట్టేసుకుని రావాల్సివచ్చిందని స్థానికులు వాపోయారు. కావున బ్రిడ్జికింద చేరిన వర్షపు నీటిని తొలగించాలని వారు కోరుతున్నారు.

మీసంపై మాట మార్చిన తోపు

అనంతపురం సిటీ, జూన్ 6: పరిటాల సునీత గెలిస్తే.. మీసం కొరిగిం చుకుంటా.. అని కొన్ని రోజుల కిందట ఓ ఛానెల్ ఇంటర్వ్యూలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్ని విషయం తెల్సిందే. ఈ ఎన్నికల్లో పరిటాల సునీత ఘనంగా సాధించింది. తోపు ఓటమి పాలయ్యాడు. ఇదే విషయమై ఈనెల 4వ తేదీన 'తోపుదుర్తి మీసం కొరిగించుకుంటాడా..?' అని ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. ఆ వార్త సోషల్ మీడియాలో తెగ వైరలైంది. దీనిపై అటు టీడీపీ, వైసీపీ వర్గాల్లో జోరుగా చర్చ సాగింది. ఈ నేపథ్యంలో తాజాగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఓ విలేకరి తోపు చేసిన సవాల్ ను గుర్తు చేశాడు. చేసిన సవాల్ మేరకు మీసం తీసుకుంటారా అని ప్రశ్నిం చారు. దీనికి తోపు సమాధానమిస్తూ... 'ధర్మవరం ఎమ్మెల్యే సీటు రాకుంటే పరిటాల శ్రీరామ్ రాజకీయ సన్యాసం చేస్తామన్నారు కదా.. చేయమనండి.. అదే విధంగా వచ్చే ఆరు నెలల్లో ఇచ్చిన హామీలన్నీ పరిటాల సునీతను నెరవేర్చమనండి.. అప్పుడు నా మీసాలు తీయించుకుంటా..? ' అని మాట మార్చారు. ఇలా తోపు మాట మార్చిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది.

కవితా సంపుటాల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, జూన్ 6: విమలాశాంతి సాహిత్య పురస్కారాల కోసం కవుల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు విమలాశాంతి సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు శాంతినారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురించబడిన వచన కవితా సంపుటాలు మాత్రమే పురస్కారాలకు అర్హత కలవన్నారు. శతకాలు, నానీలు, పద్యకావ్యాలను పోటీలకు స్వీకరించబడవన్నారు. కాబటి అర్హత గల కవులు తమ కవితా సంపుటాలను నాలుగు కాపీలు చొప్పున జూలై 15వ తేదీ లోపు 'ఉప్పరపాటి వెంకటేశులు, డోర్ నెం.16-37-1, రాహుల్ నివాస్, ప్రశాంతి నగర్, అనంతపురం - 515 004' చిరునామాకు పోస్టుద్వారా పంపాలన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం


ప్రతిభ కనబరచిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ

ముదిగుబ్బ,జూన్6: నీట్, జేఈఈ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన మండలానికి చెందిన విద్యార్థులకు మండలకేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బొజ్జేనాయక్, ఎంఈఓ రమణప్ప నీట్‌లో ర్యాంక్ సాధించిన గణేష్ నాయక్, జేఈఈ మెయిన్స్‌లో ర్యాంక్ సాధించిన జ్యోతి ప్రసాద్ నాయక్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ నీట్, జెఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బత్తలపల్లి, జూన్ 6: మండల కేంద్రం సమీపంలోని వేల్పుమడుగుకు వెళ్లే రోడ్డులో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలవగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గంటాపురానికి చెందిన జయసింహ తన కుమారుడు మోక్షిత్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో బత్తలపల్లికి వస్తున్నాడు. అయితే వేల్పుమడుగు రోడ్డులోకి రాగానే ఎదురుగా ఆటో వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో జయసింహకు, మోక్షిత్‌కు తీవ్ర గాయాలవగా.. అనంతపురానికి చెందిన ఆటో డ్రైవర్ నాగేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. జయసింహ మోక్షిత్ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడిన జయసింహ, మోక్షిత్

కొక్కంటిక్రాస్‌లో మరొకరికి..

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే.. తులసేనాయక్ తండా(కోట)కు చెందిన రవినాయక్ గురువారం ద్విచక్రవాహనంలో కొక్కంటి క్రాస్‌కు వచ్చాడు. అక్కడ పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ పట్టించుకుని తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. ఆర్డీటీ ఆస్పత్రి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రవి నాయక్ తలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు 108 వాహనంలో అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాఠాలు సులువుగా అర్థమయ్యేలా బోధించాలి: డీఈఓ

కొత్తచెరువు, జూన్ 6: ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు సులభతరంగా అర్థమయ్యేలా బోధించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓ మీనాక్షి సూచించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో గురువారం జ్ఞాన ప్రకాశ్ రిప్రెస్‌మెంట్‌కోర్సును ప్రారంభించారు. ఈ కోర్సులో 1, 2 తరగతుల విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా ఎలా బోధించాలి, బోధనోపకారాలను ఎలా ఉపయోగించాలి, గణితం, ఆంగ్లంను సులభతరంగా ఎలా బోధించాలి, మూల్యాంకనం విధానాలను పరిచయం చేయడం వంటి అంశాల అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు వినియోగించుకుని విద్యార్థులకు పాఠశాలను అర్థమయ్యేవిధంగా బోధించాలని ఆమె సూచించారు. ఆర్జేడీ రాఘవ రెడ్డి ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ రవిసాగర్, ఏఎంఓ మహేంద్రరెడ్డి, ఎంఈఓ గోపాల్‌నాయక్, ప్రథం కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం

- కొత్తచెరువు మండలంలో 1,531 ఓట్ల మెజారిటీ

కొత్తచెరువు, జూన్ 6: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొత్తచెరువు మండలంలో టీడీపీ తిరిగి పూర్వవైభవం దక్కించుకుంది. మండలంలో 38 పోలింగ్ కేంద్రాలకు గాను 19 కేంద్రాల్లో వైసీపీకి 1173 ఓట్లు మెజారిటీ రాగా.. మిగిలిన 19 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీకి 2704 ఓట్లు మెజారిటీ వచ్చాయి. దీంతో మొత్తంమీద 1531 ఓట్ల మెజారిటీ సాధించి మండలం టీడీపీకి కంచుకోటగా పట్టు సాధించింది. మండలం ఆది నుంచి టీడీపీకి కంచుకోటగా ఉండేది. అయితే 2019 ఎన్నికల్లో పట్టుకోల్పోయింది. దీంతో 4,403 ఓట్లు వైసీపీకి మెజారిటీ వచ్చాయి. అయితే ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో టీడీపీకి 1531 ఓట్లు మెజారిటీ వచ్చాయి. దీంతో కొత్తచెరువు మండలం మళ్లీ టీడీపీకి కంచుకోటగా నిలిచింది. వైసీపీకి 1, 3, 4, 5, 7, 10, 11, 12, 13, 14, 15, 18, 21, 26, 29, 30, 34, 37, 38వ పోలింగ్ కేంద్రాల్లో వైసీపీకి 1173 ఓట్లు రాగా.. 2, 6, 8, 9, 16, 17, 19, 20, 22, 23, 24, 25, 27, 28, 31, 32, 33, 35, 36 కేంద్రాల్లో టీడీపీకి 2704 ఓట్ల మెజారిటీ వచ్చింది. దీంతో మొత్తం మీద టీడీపీకి 1531 ఓట్లు మెజారిటీ సాధించింది. దీంతో కొత్తచెరువు మండలం టీడీపీకి కంచుకోటగా మారింది.

నీట్‌లో లికేశ్‌రెడ్డికి 352వ ర్యాంకు


లికేశ్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కొత్తచెరువు/ పుట్టపర్తి జూన్ 6: ఇటీవల వెలువడిన నీట్ పరీక్ష ఫలితాల్లో పుట్టపర్తి నగర పంచాయతీకి చెందిన కత్తిభాస్కర్‌రెడ్డి, కల్పన దంపతుల కుమారుడు కత్తి లికేశ్‌రెడ్డికి ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 352 వ ర్యాంకు సాధించాడు. 720 మార్కులకు గాను 710 మా ర్కులు సాధించి మెడికల్ ఓపెన్ కేటగిరి కింద ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి 1 నుంచి 10వతరగతి వరకు సత్యసాయి హయ్యర్ సెకెండరీస్కూల్‌లో చదువుకున్నాడు. ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్యజూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. నీట్‌లో ర్యాంకు సాధించినందుకు ఆ విద్యార్థిని తల్లిదండ్రులు అభినందిస్తూ స్వీటు తినిపించారు.

త్రిలింగేశ్వరాలయంలో మహాచండీయాగం


ప్రత్యేక అలంకరణలో త్రిలింగేశ్వరుడు


మహాచండీయాగాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ధర్మవరం రూరల్, జూన్6: పట్టణంలోని తేరుబజారులో గల త్రిలింగేశ్వరాలయంలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని మహాచండీయాగం నిర్వహించారు. అర్చకుడు రాఘవశర్మ ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం విశేష పూజలుపూజలు గావించారు. తర్వాత వేదపండితుల ఆధ్వర్యంలో మహాచండీయాగం చేశారు. ప్రజలంతా ఆయురోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు బాగా పండాలని ఈ యాగం చేసినట్లు అర్చకుడు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ పాటు అన్నదానం చేశారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 18 మంది విద్యార్థుల ఎంపిక

ధర్మవరం, జూన్ 6: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)2023-24 విద్యాసంవత్సరానికి పట్టణంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 3న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు రాశారని, ఇందులో లక్ష్మీనివాస్, పల్లవి ప్రతిభ కనబరచి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారని అన్నారు. మిగిలిన కీర్తన, కార్తీక్ సంజయ్, మహాలక్ష్మీ,సంతోష్‌నిహారిక, నారాయణ, గణేశ్, పవన్‌శృతి, మానస, ఉమేశ్, జోషు, భవ్యసాయి, చాంద్‌బాషా, జగన్, కీర్తి,యోషికలు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల పాటు ఒక్కొక్కరికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం అందుతుందని అన్నారు.

రేపటి నుంచి రాజుల పరుష

నల్లమాడ, జూన్ 6: మండలంలోని సోముగుట్టపల్లి, పెద్దకోట్ల పల్లి గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ శనివారం నుంచి రాజుల పరుష నిర్వహించనున్నట్లు గ్రామాల పెద్దలు గురువారం ప్రకటనలో తెలిపారు. 8న దాసంగాలతో పరుష ప్రారంభమవుతుందన్నారు. 10న యలవ గంప ఊరేగింపు, 11న ఎద్దులబండ్ల పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న పరుష ముగుస్తుందన్నారు. ఎడ్లబండ్ల పోటీల్లో పాల్గొనేవారు రూ. వెయ్యి చెల్లించి రసీదు పొందాలన్నారు. ఇందులో మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.పదివేలు, మూడో బహుమతి రూ.5వేలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలవారు పాల్గొనాలని కోరారు.

విత్తన వేరుశనగ పంపిణీ పరిశీలన


విత్తన వేరుశనగ పంపిణీని పరిశీలిస్తున్న డీడీఏ విద్యావతి

తాడిమర్రి, జూన్ 6: మండల కేంద్రంలో గురువారం చేపట్టిన విత్తన వేరుశన పంపిణీ కార్యక్రమాన్ని డీడీఏ విద్యావతి పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్, పంపిణీ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిరైతుకు నాణ్యమైన విత్తనకాయలు పంపిణీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి, రైతులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


చరణ్‌తేజ్‌నాయక్

ధర్మవరం, జూన్ 6: పట్టణానికి చెందిన అరుణాబాయి, గోపాల్‌నాయక్ దంపతుల పెద్దకుమారుడు చరణ్‌తేజ్‌నాయక్ అదృశ్యమయ్యాడు. ఇతను స్థానిక బీఎస్ఆర్ బాలుర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. కాగా బుధవారం ఇంటినుంచి వెళ్లిన ఆ బాలుడు ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో తల్లిండ్రులు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తెలిసిన వారి ఇళ్లల్లో గాలించారు. ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు తల్లి అరుణాబాయి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు.

కూలిన ఆలయ ముఖద్వారం పరిశీలన


కూలిన ముఖద్వారాన్ని పరిశీలిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

గాండ్లపెంట, జూన్ 6: మండలంలోని కటారుపల్లి క్రాస్‌లో గల కంబాలరాయుడి ఆలయ ముఖద్వారం ఇటీవల వర్షానికి కూలిపోయింది. దీనిని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖద్వారం పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు అలాగే ధ్వజస్తంభానికి, ఆలయ పరిసర ప్రాంతాలకు కంచె వేయించి పురావస్తు శిల్పాలను కాపాడతామన్నారు. అలాగే ప్రతి యేడాది ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా.. కదిరి పౌర్ణమి రోజున కంబలరాయుడు ముఖద్వారానికి ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నేతలు రామమోహన్, డీఎల్ నరసింహారావు, పవన్‌కుమార్, తుంగా వేణుగోపాల్‌రెడ్డి, వేమన ఆలయ పూజారి వేమనందారెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కదిరిఅర్బన్, జూన్ 6: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు సాయిశ్రీనివాసులు(20) కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సాయి శ్రీనివాసులు, అతడి స్నేహితులు సురేష్, తేజ కలిసి గతనెల 29వ తేదీన బైక్‌లో బత్తపల్లికి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి కదిరికి వస్తుండగా గట్లు వద్ద తోపుడుబండిని అదుపు తప్పి ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయి శ్రీనివాసులును మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అతను అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులద్వారా తెలిసిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

'కూటమి విజయం బ్రహ్మాండం'

పుట్టపర్తిరూరల్/ పుట్టపర్తి, జూన్ 6: నూతనంగా ఏర్పడిన జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు అందించిన విజయం బ్రహ్మాండమని బీజేపీకల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర కన్వీనర్ తలమర్ల హరికృష్ణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రత్నాకరం కొండమరాజు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలంయలో గురువారం వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలబడిందన్నారు. రాష్ట్రప్రజలు కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉంటేనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ఓట్లు వేశారని తెలిపారు. అనునిత్యం ప్రజల సేవకే ఎన్డీఏ కూటమి పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ జ్యోతి ప్రసాద్, జిల్లా కోశాధికారి సురేంద్ర బాబు,పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధానకార్యదర్శి నారాయణ, కార్యదర్శి సతీష్, ˇదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టుకొమ్మ


ప్రధాన రహదారిపై విరిగి పడిన చెట్టు కొమ్మ

ఓబుళదేవరచెరువు, జూన్ 6: మండలకేంద్రంలోని శివాలయం నాగలకట్ట వద్ద బుధవారం రాత్రి కురిసిన గాలివానకు వేపచెట్టు కొమ్మ విరిగి కదిరి, హిందూపురం రహదారిపై పడింది. అది అడ్డుగా ఉండడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. చివరకు స్థానికులు రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మను తొలగించడంతో రాకపోకలు సాగాయి. గురువారం ఉదయం విద్యుత్ అంతరాయం ఉండడంతో ఆప్రాంతంలో విద్యుత్‌శాఖాధికారులు విద్యుత్ మరమ్మతులు చేయడంతో పాటు రోడ్డుపై మిగిలి ఉన్న కొమ్మలను పంచాయతీ సిబ్బంది చేత తీయించేశారు. మండల వ్యాప్తంగా 34.5మిమీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి మృతి


షామీర్‌బాషా (ఫైల్)

ఓబుళదేవరచెరువు, జూన్ 6: మండలకేంద్రంలోని చెరువు ప్రాంతంలో ఉంటున్న బాబావలి కుమారుడు షామీర్‌బాషా (28) 27-4-2022వ తేదీన తల్లితో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. అప్పట్లో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. కాగా 29-4-2022న చిలమత్తూరు మండలం కొడికొండ హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కక్కడే మృతిచెందా రు. మృతదేహాన్ని ఎవరూ గుర్తించకపోవడంతో అనాథ శవంగా అంత్యక్రియలు చేశారు. కాగా అతడి అదృశ్యం కేసుకు సంబంధించి గురువారం క్రిమినల్ ఇంటలిజెన్స్ సిస్టమ్ సాంకేతిక సహకారంతో అప్పట్లో మృతి చెందిన వ్యక్తి ఫొటో, అదృశ్యమైన వ్యక్తి ఫొటో ఒకటిగా ఉండడంతో మృతి చెందినది షామీర్‌బాషానేనని గుర్తించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుకొండ రూరల్, జూన్ 6 : మండలకేంద్రమైన రొద్దం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా రొద్దం, రొద్దకంపల్లి, నారనాగేపల్లి, ఎం కొత్తపల్లి, కనుమర, గౌరాజుపల్లి, తాడంగిపల్లి, మోపుర్లపల్లి, రెడ్డిపల్లి, దొడగట్ట, గోనిమేకలపల్లి, పెద్దగువ్వలపల్లి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మరమ్మతుల అనంతరం పునరుద్ధరిస్తామని, వినియోగదారులు ఇది గమనించి సహకరించాలని వారు కోరారు.

29 మందిపై కేసు

పెనుకొండ రూరల్, జూన్ 6: మండలపరిధిలోని మునిమడుగు గ్రామంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రెండు వర్గాల కార్యకర్తలు ఘర్షణకు పాల్పడ్డారు. ఇందులో టీడీపీ కార్యకర్త చౌడప్ప, వైసీపీ కార్యకర్త నాగరాజు గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 20మంది వైసీపీ, తొమ్మిది మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు కియ ఇండస్ట్రియల్ ఎస్ఐ రంగడు తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

పెనుకొండ రూరల్, జూన్ 6: మండలంలోని అడదాకులపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త అయిన బాబావలి అనే తాపీ మేస్త్రి గురువారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఎమ్మెల్యేగి గెలుపొందిన సవిత ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు అడదాకులపల్లికి చేరుకుని బాబావలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

పెనుకొండ రూరల్ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కొండాపురానికి చెందిన నారాయణ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురవారం మృతిచెందాడు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సవిత ఆదేశాల మేరకు టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య కొండాపురానికి చేరుకుని నారాయణ మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేణు, నాగరాజు, ప్రసాద్, సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బైకు, బొలెరో వాహనం ఢీ

● ఇద్దరికి గాయాలు

గోరంట్ల, జూన్ 6: మండలంలోని బెంగుళూరు రహదారిలో ఉన్న బూదిలి సమీపంలో పాపిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని బొలేరో వాహనం ఢీకొనడంతో గణేష్, చిదంబరం అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గోరంట్లలోని ఎండాలబండ వీధికి చెందిన గణేష్, చిదంబరం కలిసి పని నిమిత్తం గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పాపిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బోలేరో వాహనం ఢీకొనడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గణేష్ కుడి భూజానికి గాయం కాగా, చిదంబరం కూడి మోకాలు విరిగింది. వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్ 6: మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన రామలక్ష్మమ్మ అనే వృద్ధురాలు గురువారం విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రామలక్ష్మమ్మ ఒక్కగానొక్క కుమారుడు నవీన్‌ను ఎంతో గారాభంగా పెంచింది. నవీన్ ప్రయోజకుడు కాకపోగా, మద్యానికి బానిపై తరచూ వేధిస్తుండడంతో ఆమె తీవ్ర మనోవేదనకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో ఆమె విషద్రావకం తాగడంతో అస్వస్థతకు గురైంది. ఆమెను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం తరలించారు.

ఇద్దరు రైతులకు పాముకాటు

గోరంట్ల / పెనుకొండ రూరల్, జూన్ 6: గోరంట్ల మండలంలోని బూగానిపల్లిలో, పెనుకొండ మండలంలోని నాగలూరులో గురువారం ఇద్దరు రైతులు పాము కాటుతో అస్వస్థతకు గురయ్యారు. గోరంట్ల మండలంలోని బూగానిపల్లికి చెందిన రైతు రంగప్ప గ్రామ సమీపంలోని పొలంలో పశువుల మేతకోసం గడ్డి కోస్తుండగా ఎడమచేతిపై కట్ల పాము కాటు వేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ వైద్యచికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం తరలించారు. అలాగే పెనుకొండ రూరల్ మండలంలోని నాగలూరులో సోమశేఖర్‌రెడ్డి అనే రైతు తన పొలంలో మొక్కజొన్న పంట సాగుచేశాడు. అందులో గడ్డి కోస్తుండగా ఎడమకాలికి పాముకాటేయడంతో గట్టిగా కేకలు వేశాడు. దీంతో అక్కడికి చేరుకున్న తోటి రైతులు హుటాహుటిన ఆటోలో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంత రం మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

బైకు అపహరణ

బెళుగుప్ప, జూన్ 6: మండలంలోని అంకంపల్లికి చెందిన వీఆర్ఏ మహేష్ బైకుని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గత నెల 31వ తేదీ రామసాగరం క్రాస్ వద్ద ఆపి ఆఫీస్ పని నిమిత్తం బెళుగుప్పకు వెళ్లారు. పని ముగించుకుని వెళ్లి చూడగా బైకు లేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని విచారించాలంటూ గురువారం వీఆర్ఏ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎన్నికల కోడ్ ముగిసింది

ప్రశాంతంగా జీవించండి: ఎస్ఐ



బస్టాండు ఆవరణలో బందోబస్తులో ఉన్న పోలీసులు

అగళి, జూన్ 6: ఎన్నికల కోడ్ గురువారం సాయంత్రం 6గంటలకు ముగిసిందని ఎస్ఐ వీరేష్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీ నాయకులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో గ్రామాలలో ఘర్షణలు, అలజడులు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నాయకులు ఉండి ప్రజలకు సేవలందించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం 144 సెక్షన్ గురువారంతో ముగిసినట్లు తెలిపారు.

పాలన గాడిలో పడేనా..?

● వైసీపీ హయాంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్వీర్యం
● ప్రజలకు దూరమైన సేవలు

చిలమత్తూరు, జూన్ 6: మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయి. అధికారుల పనితీరుపై పర్యవే క్షణ లేకపోవడంతో ప్రజా పాలన గాడి తప్పింది. దీంతో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ప్రధానమైన తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ వంటి ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలాంటి పరిస్థితి నెల కొంది. బాధితులు రోజులు తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా కనీసం సమస్య వినేవారు కూడా లేకపోయారు. మండలస్థాయి మేసిస్ట్రేట్ అయిన తహసీల్దార్ కార్యాలయం నుంచే రెవెన్యూకు సంబంధించిన పాలన సాగుతుంది. ఐదేళ్లుగా వైసీపీ నాయకులకు అడ్డాగా మారింది. వారు చెప్పినట్లుగానే ఈ కార్యాలయంలో పనులు జరిగేవి. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు ఉద్యోగులు తమ విధులు మరచి అక్రమార్జనకు అలవాటు పడ్డారు. సమస్యలతో వచ్చే ప్రజలకు అందుబాటులో లేకుండా సొంత పనుల్లో బిజీగా గడిపారు. వైసీపీ నాయకులు చెబితేనే పనులు చేసి పెట్టారు. లేదంటే డబ్బులతో రావాలని చెప్పిన సందర్భాలు కోకల్లలు. దీంతో ప్రజలు గత టీడీపీ పాలనను గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పట్లో ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశి క్షణ ఉండేదని ఇప్పుడు అవి కనపడలేదని బాహటంగానే చెబుతున్నారు. ఇక మండల పరిషత్ వ్యవహారినికొస్తే వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన ప్రభుత్వ శాఖ ఇది అని చెప్పవచ్చు. మండల పరిషత్ పాలకవర్గం పూర్తిగా వైసీపీ చేతుల్లో ఉన్నా గ్రామాల్లో అభివృద్ధి జరగలేదన్నది జగమెరిగిన సత్యం. ఈ ఐదేళ్లలో కార్యాలయంలో పని చేసే అధికారులు కూడా పాలనపై దృష్టి పెట్టలేదు. పాలకవర్గానికి వత్తాసుపలుకుతూ కాలం వెళ్లబుచ్చారనడంలో ఎలాంటి సందేహం లేదు. చివ రికి మండల సర్వసభ్యసమావేశాలు కూడా తూతూ మంత్రంగా జరిగాయనడంలో అతిశయోక్తి లేదు. అదే విధంగా వైసీపీ పాలనలో పోలీస్ స్టేషన్ పూర్తిగా పంచాయితీలకు అడ్డాగా మారిందనే చెప్పవచ్చు. ఫిర్యాదులతో వచ్చే ప్రజలకు పరిష్కారాలు దొరక్క ఇబ్బందిపడిన సంఘటనలు అనేకం. కేవలం వైసీపీ నాయకుల కనుసన్నల్లో కేసుల నమోదు జరి గిందనేది వాస్తవం. గ్రామాల్లో శాంతి భద్రతల విష యంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పోలీసు లు వైసీపీ నాయకుల కనుసన్నల్లో మెలగాల్సి వచ్చింది.



చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయం

మంచి పాలన కోసం కోటి ఆశలతో...

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మండల స్థాయిలో మంచి పాలన అందుతుందన్న కోటి ఆశలతో ప్రజలు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన ప్రభుత్వ కార్యాలయాలు కొత్త ప్రభుత్వంలో దారికి వస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. దారితప్పిన అధికారులను గాడిలో పెట్టి ప్రజలకు మంచి సేవలు అందించేందుకు చర్యలు చేపడుతారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రౌండు రౌండుకు సవితకు మెజార్టీ

ఐదో రౌండ్‌కే వెనుదిరిగిన ఉషశ్రీచరణ్



పెనుకొండ టౌన్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి సవితకు ప్రతి రౌండులో మెజార్టీ వచ్చింది. ఐదో రౌండ్‌కే వైసీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్‌కు ఓటమి అర్థమై కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగారు. సవిత 33,388 వేల మెజార్టీతో మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 265 పోలింగ్ కేంద్రాలకుగాను 19రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించారు.

రౌండ్	సవిత	ఉషా శ్రీచరణ్	సవిత మెజార్టీ
1.	5366	4755	611
2.	5120	3747	1373
3.	6419	4404	2015
4.	5343	4164	1179
5.	5983	3980	2003
6.	6961	3999	2962
7	5423	3845	1638
8.	5915	4528	1387
9.	6756	5203	1553
10.	7209	2975	4231
11.	5931	3854	2047
12.	5668	3379	2289
13.	6332	4070	2262
14.	6126	4041	2025
15.	5074	4160	914
16.	5087	4491	596
17.	6721	4980	1741
18.	5223	4763	460
19.	5243	4427	816

ఈవీఎంల ద్వారాఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి సవితకు 1,11,960 ఓట్లు రాగా, ఉషశ్రీకి కు 79,795 వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,633మంది ఓటు మక్కు విని యోగించు కున్నారు. ఇందులో సవితకు 1872, ఉషాశ్రీకి 649, ఇతరులకు 30, నోటా 16 రాగా, 66 రిజెక్ట్ అయ్యాయి. పోస్టల్ బ్యాలెట్‌లో సవితకు 1223 ఓట్ల మెజార్టీ వచ్చింది. మొత్తం మీద సవిత వైసీపీ అభ్యర్థి ఉషశ్రీపై 33,388 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

రెండో రోజూ అదే సంబరం



కేక్ కట్‌చేస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూన్6: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఊహించిన దాని కంటే అత్యధిక స్థానాలు సాధించి చంద్రబాబునాయుడు నాలుగో సారి ముఖ్యమంత్రి కాబోతున్నారన్న ఉత్సాహంతో నియోజకవర్గవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు గెలుపొందడంతో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఉత్సాహంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెండో రోజు గురువారం కూడా సంబరాలు జరుపుకొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా బీజేపీ నాయకులు చంద్రశేఖర్, అసెంబ్లీ ఇన్‌చార్జ ఆర్‌వీ గుప్తా, నాయకులు శ్రీకాంత్,నారాయణప్ప, బానుప్రకాష్ తదితరులతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుండుమలకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి కృషితో విజయం సాధించామని అందరూ సంతోషం వ్యక్తం చేశారు. అనేక మంది మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.


డిపాజిట్ కోల్పోయిన 11మంది అభ్యర్థులు

మడకశిర టౌన్, జూన్ 6:

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మడకశిర నియోజకవర్గం నుంచి మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా అందులో 11మంది డిపాజిట్లు కోల్పోయారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు మినహా ఎవరికీ డిపాజిట్లు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే సుధాకర్‌కు సైతం డిపాజిట్లు గల్లంతు అయ్యాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుకు 79,983 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు 79,632 ఓట్లు వచ్చాయి. దీంతో ఎంఎస్ రాజు 351 ఓట్ల మెజారిటీతో గెలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి కే సుధాకర్‌కు 17,380 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ఇందీవర్‌కు 3,740, ఇండిపెండెంట్ అభ్యర్థులు టీ ధనరాజుకు 865, ఆర్‌జీ పవిత్రకు 300, జగనాథ్ ప్రసాద్‌కు 408, ఎం లక్ష్మీనరసప్పకు 310, ఎం రాజన్నకు 166, కే రవీంద్రకు 114, ఆర్ గురుమూర్తికి 128, బీ కరెనింగప్పకు 103, ర్యాడికల్ పార్టీ అభ్యర్థి హనుమంతరాజుకు 275 ఓట్లు పోల్ అయ్యాయి.

కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో

కొనసాగుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యం



పావగడ, జూన్ 6: కర్ణాటకలో ఈనెల 3న జరిగిన ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన డీటీ శ్రీనివాస్ ఆధిక్యంలో ఉన్నట్లు తెలిసింది. బెంగళూరు ఆర్ట్స్ కళాశాలలో గురువారం జరిగిన ఓట్ల లెక్కింపులో కడపటి వార్తలు అందే సమయానికి మొదటి ప్రాధాన్యత కలిగిన ఓట్లతో డీటీ శ్రీనివాస్ రెడు వేల మెజార్టీతో ఆధిక్యంలో ఉన్నట్లు తెలిసింది. డీటీ శ్రీనివాస్‌కు 8,920 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి వైఏ నారాయణస్వామికి 7,120ఓట్లు రాగా, ఇండిపెండెంట్ అభ్యర్థి వినోద్ శ్రీనాథ్‌కు 6881ఓట్లు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ డీటీ శ్రీనివాస్‌కు ముందంజలో ఉన్నట్లు సమాచారం.

మెరుగైన వైద్యసేవలు అందించండి

డీఎంహెచ్ఓ



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

మడకశిర రూరల్, జూన్ 6 : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి వైద్య సిబ్బందికి సూచించారు. ఆమె గురువారం మండలంలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. బిసీజీ వ్యాక్సిన్ గురించి ప్రజలకు వివరించాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం మందుల నిల్వ వివ రాలను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నరేశ్ కు మార్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రాము, ఆరోగ్యకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



అశ్విని (ఫైల్)

పెద్దపప్పూరు, జూన్ 6: మండలంలోని ముచ్చుకోట గ్రామానికి చెందిన అశ్విని (21) చదువు ఇష్టం లేక గురువారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, కమ్మక్కల కుమార్తె అశ్విని కొన్నేళ్లక్రితం చదువును మధ్యలోనే ఆపేసింది. కొన్ని రోజుల నుంచి చదువును కొనసాగించాలని కుటుంబ సభ్యులు చెబుతూ ఒత్తిడి చేసేవారు. చదువు ఇష్టం లేని అశ్విని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇంకా వివాహం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

కవితా సంపుటాల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, జూన్ 6: విమలాశాంతి సాహిత్య పురస్కారాల కోసం కవుల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు శాంతినారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురించబడిన వచన కవితా సంపుటాలు మాత్రమే పురస్కారాలకు అర్హత కలవన్నారు. శతకాలు, నానీలు, పద్యకావ్యాలను పోటీలకు స్వీకరించబడవన్నారు. కాబటి అర్హత గల కవులు తమ కవితా సంపుటాలను నాలుగు కాపీలు చొప్పున జూలై 15వ తేదీలోపు 'ఉప్పరపాటి వెంకటేశులు, డోర్ నెం.16-37-1, రాహుల్ నివాస్, ప్రశాంతి నగర్, అనంతపురం - 515 004' చిరునామాకు పోస్టుద్వారా పంపాలన్నారు.

రాళ్లదాడి కేసులో 11మంది అరెస్ట్

తాడిపత్రిటౌన్, జూన్ 6: పట్టణంలో గతనెల 13, 14 తేదీల్లో జరిగిన రాళ్లదాడి కేసులో గురువారం వైసీపీకి చెందిన 11 మందిని అరెస్ట్‌చేసినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. నిందితులను పట్టణ సమీపంలోని రమేష్‌రెడ్డికాలనీ వద్ద అరెస్ట్ చేశామన్నారు. వైసీపీకి చెందిన రవితేజారెడ్డి, టైక్వాండో బాబా, ప్రభాకర్, నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు మరో ఏడుగురిని అరెస్ట్ చేసి గుంతకల్లు కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరికి కోర్టు 15 రోజులు రిమాండ్ విధించడంతో కడప జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

రాయదుర్గంరూరల్, జూన్ 6: పట్టణ సమీపంలోని పైతోట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంజు(13) మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు గురువారం సీఐ శ్రీనివాసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలం చౌళూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు కుమారుడు పట్టణ సమీపంలోని పైతోటకు బంధువుల ఇంటి వద్ద మంజు ఆడుకుంటుండగా మొలకాల్మూరు నుంచి రాయదుర్గానికి వెళుతున్న కారు ఢీ కొట్టింది. స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కూల్‌డ్రింక్స్ దుకాణంలో చోరీ

రాయదుర్గం రూరల్, జూన్ 6: పట్టణంలోని శాంతినగర్‌లో కూల్‌డ్రింక్స్ దుకాణంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడుతున్నట్లు షాప్ యజమాని కృష్ణ తెలిపారు. దుకాణానికి రంధ్రం పెట్టి చోరీకి పాల్పడిన విషయాన్ని గురువారం తెల్లవారుజామున కనుక్కున్నట్లు ఆయన తెలిపారు. దుకాణంలో ఉంచిన రూ.70 వేల సరుకు చోరీకి గురైనట్లు తెలిపారు. గుట్కా, కూల్‌డ్రింక్స్, సిగరెట్‌ప్యాక్‌లతో పాటు రూ.25 వేలు దేవుని హుండీ, రూ.20 వేలు ఇతర వస్తువులు మొత్తం రూ.70 వేలు సరుకు చోరీ చేసినట్లు తెలిపారు. సంఘటపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నిరుపయోగంగా చెక్‌పోస్టు బాక్సులు

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం

విద్యుత్ బకాయిలు రూ.1.10 లక్షలు

మడకశిర రూరల్, జూన్ 6: ఇసుక, మద్యం అక్రమ రవాణా అరికట్టాలనే ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం సరిహద్దు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో చెక్ పోస్టులను ఏర్పాటుచేసింది. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి సంబంధించిన విద్యుత్ బిల్లులు రూ.1.10 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారు. సరిహద్దు గ్రామాల్లో ఇసుక, మద్యం అక్రమ రవాణా అరికట్టడం కోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. మండలంలోని గౌడనహళ్లి, క్యాంపురం, గౌరిపురం, ఆర్ అనంతపురం, పాపసానిపల్లి, యు రంగాపురం మణూ రు, చందకచర్ల గ్రామాల్లో సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించారు. సిబ్బంది రాత్రిళ్లి కూడా విధులు నిర్వహిస్తుండడంతో వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి మీటర్లు బి గించారు. ప్రభుత్వం యేడాదిపాటు వాటిని నిర్వహించి, అనం తరం వాటిని ఎత్తివేసింది. అందుకు సంబంధించి ప్రభుత్వం రూ.1.10 లక్షలు విద్యుత్ బిల్లులను ఆ శాఖకు చెల్లించాల్సి ఉంది. మూడేళ్ల అయినా చెల్లించలేదు. విద్యుత్ మీటర్లు మాత్రం చెక్‌పోస్టు బాక్సులకు వేలాడుతున్నాయి. చాల చోట్ల విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. మరి కొన్ని చోట్ల చెక్‌పోస్టు బాక్సులు అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారినట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీనిపై స్థానిక విద్యుత్ శాఖ ఏఈ మహేంద్రను వివరణ కోరగా.. సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటుచేసిన అధికారులు చెబితే చెక్ పోస్టులకు ఉన్న విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని తెలిపారు.





గౌడనహళ్లి, క్యాంపురం చెక్ పోస్టు బాక్సులు, వేలాడుతున్న విద్యుత్ మీటర్లు

ఘనంగా శనీశ్వర జయంతి



ప్రత్యేక అలంకరణలో పావగడలోని జేష్టాదేవి సమేత శనీశ్వరుడు

పావగడ, జూన్ 6 : భక్తులు కొంగు బంగారంగా కొలిచే, నవగ్రహాలలో ఒకరైన శనీశ్వరుడి జయంతిని గురువారం పావగడ శనీశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఎంతో ఇష్టమైన నల్ల గుడ్డ, నూగులతో ఉదయం 4గంటల కు తైలాభిషేకం చేశారు. అనంతరం సహస్రనామార్చన తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పావగడలో వెలసిన జేష్టదేవి సమేతుడైన శనీశ్వరుడిని పుట్టినరోజు సందర్భంగా దర్శించుకుంటే పంచమ శని, అష్టమశని, ఏలినాటిశని, కాకి స్పర్శ తదితర దోషాలు తొలుగుతాయని, అష్టైశ్వర్యాలు కలిసి వస్తాయని భక్తుల విశ్వాసం. నవగ్రహాలను పూజిస్తే ఎంతో మేలు జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో నవగ్రహ విగ్రహాలు

హిందూపురంలో...

హిందూపురం అర్బన్: వైశఖ బహుళ అమావాస్య శనీశ్వరస్వామి జయంతి ని పురస్కరించుకొని పట్టణ పరిధిలో పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనిమహాత్ముడని పుట్టినరోజున కొలిస్తే కష్టాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. దీంతో శ్రీకంఠపురం, టీచర్స్ కాలనీలోని శనీశ్వర దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామి వారికి వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామికి ప్రీతికరమైనదని నువ్వుల నూనెతో అభిషేకం చేసి, నువ్వులనూనె దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా శ్రీకంఠపురంలోని శనేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు రవిస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. నానెప్పనగర్‌లోని షిర్డీసాయి ఆలయంలో గురువారం పురస్కరించుకొని భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. షిర్డీసాయిని దర్శించుకుని పూజలు చేశారు.



పురంలో ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

13,030 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ: ఏడీ

మడకశిర, జూన్6: ఖరీఫ్ సాగుకోసం ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను నియోజకవర్గవ్యాప్తంగా గురువారానికి 14,560 మంది రైతులకు 13,030 క్వింటాళ్లను పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్ తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.... మడకశిర మండలంలో 20 రైతు భరోసా కేంద్రాల ద్వారా4819 మంది రైతులకు 4003 క్వింటాళ్లు అందించామన్నారు. అలాగే అమరాపురం మండలంలో 15 ఆర్బీకేల ద్వారా 3719 మంది రైతులకు 3356 క్వింటాళ్లు, గుడిబండలో 15ఆర్బీకేల ద్వారా 3119 మందికి 2796 క్వింటాళ్లు, అగళిలో 11 ఆర్బీకేల ద్వారా 1726 మందికి 1465.6 క్వింటాళ్లు అందించామన్నారు. రొళ్ల మండలంలో 10ఆర్బీకేల ద్వారా 1177 మందికి 1409.49 కింటాళ్లు పంపిణీ చేశామన్నారు. మడకశిర డివిజన్‌కు 16,124 క్వింటాళ్లు కేటాయించగా, ఇప్పటివరకు 13,030 క్వింటాళ్లు పంపిణీ చేశారన్నారు. విత్తన వేరుశనగ కోసం ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు అందిస్తామన్నారు.

ఆర్బీకేలకు చేరిన సబ్సిడీ ఎరువులు

గుడిబండ, జూన్ 6: మండలంలోని కొంకల్లు, మందలపల్లి, ముదుగూరు, సీసీగిరి, రాళ్లపల్లి, జమ్మలబండ, గుడిబండ, కరేకెర, కెఎన్‌పల్లి, తాళికెర, జీమోరుబాగల్, గ్రామాల్లోని రైతు బరోసా కేంద్రాలకు సబ్సిడీ ఎరువులు చేరినట్లు ఏఓ వీరనరేష్ గురువారం తెలిపారు. ఆర్బీకే కేంద్రాల్లో యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ తదితర ఎరువులను నిలువ ఉంచినట్లు ఆయన తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ అందజేసి రైతులు సబ్సిడీ ఎరువులను పొందవచ్చని తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి మృతి

ఓబుళదేవరచెరువు, జూన్ 6: మండలకేంద్రంలోని చెరువు ప్రాంతంలో ఉంటున్న బాబావలి కుమారుడు షామీర్‌బాషా(28) 27-4-2022వ తేదీన తల్లితో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. అప్పట్లో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. కాగా 29-4-2022న చిలమత్తూరు మండలం కొడికొండహైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని ఎవరూ గుర్తించకపోవడంతో అనాథ శవంగా అంత్యక్రియలు చేశారు. కాగా అతడి అదృశ్యం కేసుకు సంబంధించి గురువారం క్రిమినల్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ సహకారంతో అప్పట్లో మృతిచెందిన వ్యక్తి ఫొటో, అదృశ్యమైన వ్యక్తి ఫొటో ఒకటిగా ఉండడంతో షామీర్‌బాషానేనని గుర్తించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బత్తలపల్లి, జూన్ 6: మండల కేంద్రం సమీపంలోని వేల్పుమడుగుకు వెళ్లే రోడ్డులో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలవగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గంటాపురానికి చెందిన జయసింహ తన కుమారుడు మోక్షిత్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో బత్తలపల్లికి వస్తున్నాడు. అయితే వేల్పుమడుగు రోడ్డులోకి రాగానే ఎదురుగా ఆటో వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో జయసింహకు, మోక్షిత్‌కు తీవ్ర గాయాలవగా.. అనంతపురానికి చెందిన ఆటో డ్రైవర్ నాగేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. జయసింహ మోక్షిత్ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొక్కంటిక్రాస్‌లో మరొకరికి..

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. తులసేనాయక్ తండా(కోట)కు చెందిన రవినాయక్ గురువారం ద్విచక్రవాహనంలో కొక్కంటి క్రాస్‌కు వచ్చాడు. పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ పట్టించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఆర్డీటీ ఆస్పత్రి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. రవినాయక్ తలకు బలమైన గాయాలయ్యాయి చుట్టుపక్కలవారు 108 వాహనంలో అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మీసంపై మాట మార్చిన తోపు

అనంతపురం సిటీ, జూన్ 6: పరిటాల సునీత గెలిస్తే.. మీసం కొరిగించుకుంటా.. అని కొన్ని రోజుల కిందట ఓ ఛానెల్ ఇంటర్వ్యూలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్ని విషయం తెల్సిందే. ఈ ఎన్నికల్లో పరిటాల సునీత ఘనంగా సాధించింది. తోపు ఓటమి పాలయ్యాడు. ఇదే విషయమై ఈనెల 4వ తేదీన 'తోపుదుర్తి మీసం కొరిగించుకుంటాడా..? అని ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. ఆ వార్త సోషల్ మీడియాలో తెగ వైరలైంది. దీనిపై అటు టీడీపీ, వైసీపీ వర్గాల్లో జోరుగా చర్చ సాగింది. ఈ నేపథ్యంలో తాజాగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఓ విలేకరి తోపు చేసిన సవాల్‌ను గుర్తు చేశాడు. చేసిన సవాల్ మేరకు మీసం తీసుకుంటారా అని ప్రశ్నించారు. దీనికి తోపు సమాధానమిస్తూ... 'ధర్మవరం ఎమ్మెల్యే సీటు రాకుంటే పరిటాల శ్రీరామ్ రాజకీయ సన్యాసం చేస్తామన్నారు కదా.. చేయమనండి.. అదే విధంగా వచ్చే ఆరు నెలల్లో ఇచ్చిన హామీలన్నీ పరిటాల సునీతను నెరవేర్చమనండి.. అప్పుడు నా మీసాలు తీయించుకుంటా..?' అని మాట మార్చారు. ఇలా తోపు మాట మార్చిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది.